నేటి దినపత్రిక సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం | 01 ఏప్రిల్ 2025 | పేజీలు 8

## ఇంద్రజాలికులు మాధవరావుకు కళారత్న అవార్డు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికులు వేములపాటి మాధవరావుకు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పురస్కారం కళారత్న (హంస) అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌లు ఆదివారం ఉగాది కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా మాధవరావు తనను గుర్తించి అవార్డు అందజేసిన రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖకు, సహకరించిన ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగ వేడుకలు

### రంజాన్ ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ప్రార్థనలకు హాజరైన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు సంతపేట మస్ జిద్ ఈద్గాలో రంజాన్ ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ప్రార్థనల కార్యక్రమానికి సోమవారం వైఎస్ఆర్‌సీపీ నెల్లూరు సిటీ ఇంచార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పలువురు ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు ముస్లిం సోదరులకు చంద్రశేఖర్ రెడ్డి శీతల పానీయాలు అందజేశారు. పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. 49వ డివిజన్ ఈద్గా వద్ద రంజాన్ నమాజ్ ప్రార్థనలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అల్లాహ్ దయవల్ల నెల్లూరు నగర నియోజకవర్గ ప్రజలతో పాటుగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, వైయస్ జగన్మోహన్‌రెడ్డి తరపున ప్రార్థిస్తున్నానని తెలిపారు. ముస్లిం సోదర సోదరీమణులు ప్రతి ఒక్కరు రంజాన్ పండుగను ఎంతో సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.



## 'బెల్టు' జోరు




### మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

ఏఎస్ పేట మండలంలోని గ్రామాల్లో రోజురోజుకు బెల్ట్ షాపులు అధికమై జోరు పెరిగింది. సంబంధిత ఎక్సైజ్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :**

మండలంలోని హసనాపురం గ్రామంలో ప్రభుత్వం ఒక మద్యం షాపును మంజూరు చేసింది. అలాగే మండల కేంద్రమైన ఏఎస్ పేటలో రెండు మద్యం షాపులు ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది. అయితే మండలంలోని గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించేందుకు కొందరు బ్రాందీ షాపు యజమానులకు కొంత మొత్తాన్ని చెల్లిస్తున్నట్లు సమాచారం. పలు గ్రామాల్లో పోటాపోటీన బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. అలాగే హసనాపురం గ్రామంలో పట్టపగలే ఓ కూల్‌డ్రింక్ షాప్‌లో బెల్ట్ నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. బెల్ట్ షాపులు నిర్వాహకులు క్వార్టర్ మద్యం బాటిల్‌పై అదనంగా రూ.50లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే బెల్టు నిర్వాహకులకు ఎమ్మార్పీ కంటే రూ.10 అదనంగా బ్రాందీ షాపుల యజమానులు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

ఏఎస్ పేట మండలంలో ఇంత తతంగం జరుగుతున్నా.. సంబంధిత ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కావున ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్ట్‌షాపులను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## రంజాన్ పండుగ వేడుకలు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని వివిధ గ్రామాల్లో రంజాన్ పండుగ వేడుకలు సోమవారం ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని దర్గా ఆవరణలో ఉన్న మసీదులో ముస్లింల పవిత్ర పండుగ ఈద్-ఉల్-ఫితర్ నమాజ్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మత గురువులు ఇమామ్ ప్రత్యేక బయాన్ ఉపన్యాసం చేశారు. నమాజ్ తర్వాత ముస్లిం సోదరులు పిల్లలు, పెద్దలందరూ ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా దర్గా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో నమాజ్‌కు వచ్చే భక్తుల కొరకు

## వక్ఫ్‌బోర్డు బిల్లుపై చంద్రబాబుతో చర్చిస్తున్నాం

- కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం
- ముస్లింల మనోభావాలు దెబ్బతినే అంశాలను చంద్రబాబు ప్రోత్సహించరు
- ముస్లిం సమాజంపై తెలుగుదేశం పార్టీ ఈగ కూడా వాలనివ్వదు
- ఏపీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

రంజాన్ పండుగ సందర్భంగా నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గాలోని ఈద్గాలో జరిగిన ఈద్‌కి నమాజ్‌లో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. ప్రపంచ మానవాళి కోసం, ప్రపంచ హితం కోసం 30 రోజులు కఠోర ఉపవాస దీక్షలు ఉండి ప్రపంచ దేశాలన్నీ ప్రజల కోసం ప్రార్థనలు చేశాయని తెలిపారు. మయన్మార్, ఇండోనేషియాలో వచ్చిన భూకంపాలు మనం చేసిన పాపాల మూలానేనన్నారు. ప్రపంచంలో మత కలహాలు ఎక్కువైపోయాయని, ఒకరి వ్యక్తిగత జీవితాల్లో మరొకరి జోక్యం ఎక్కువైపోయిందని పేర్కొన్నారు. వక్ఫ్ అమెండ్మెంట్ బిల్లుపై చంద్రబాబుతో చర్చిస్తున్నామని, ముస్లిం సమాజంపై

-మిగతా 2లో

# ప్రభుత్వ భూముల్లో అక్రమ లేఅవుట్‌లను తొలగించాలి

**పముజుల దశరథ రామయ్య**



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలో సౌత్ మోపూర్ గ్రామంలో సీపీఐ రాష్ట్ర సీనియర్ నాయకుడు పముజుల దశరథ రామయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని కొందరు అక్రమ లేఅవుట్ వేసి వాటిని అమ్ముకుంటూ కోట్లకు పడగలెత్తుతున్నారు. అదేవిధంగా మట్టంపాడు గ్రామంలో ఏళ్ల తరబడి, భూ వివాదాలు జరుగుతున్న, కోర్టులో కూడా కేసులు నడుస్తున్న భూముల్లో కొందరు లేఔట్ లేసి అమ్ముతున్నారు. ప్రధానంగా మట్టంపాడు గ్రామంలో లేఅవుట్లను ప్రభుత్వ అధికారులు మరోసారి పరిశీలించి, వాటికి అనుమతులు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. మాకున్న సమాచారంతో జిల్లా కలెక్టర్‌ని కలిసి ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న లేఅవుట్ నిర్వహించిన వాటిని రద్దుపరిచి, ఆ యాజమానిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే అధికారుల స్పందన లేనిచో, ప్రభుత్వ భూముల్లో ఉన్న లేఅవుట్ లపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలియజేశారు. అదేవిధంగా ప్రజలు కూడా అన్ని రకాలుగా పరిశీలించి ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు ఉన్న, లేఅవుట్‌లో మాత్రమే కొనుగోలు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆది నారాయణ, చేనేత జిల్లా కార్యదర్శి పముజుల హరి, కండి శివయ్య, పముజల గోపాలయ్య, రామయ్య వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


# వక్ఫ్‌బోర్డు బిల్లుపై చంద్రబాబుతో చర్చిస్తున్నాం



*(మొదటి పేజీ తరువాయి)*

ఈగ కూడా వాలకుండా చూసుకునే బాధ్యత తెలుగుదేశం పార్టీ చూసుకుంటుందని తెలిపారు. ముస్లింలను రక్షించుకునే బాధ్యత చంద్రబాబు నాయుడు తీసుకుంటారన్నారు. వక్ఫ్ బిల్లు యొక్క అమెండ్మెంట్‌లు పూర్తిగా బయటకు రాలేదని, ముస్లింల మనోభావాలు దెబ్బతినే అంశాలను చంద్రబాబు ప్రోత్సహించరని వెల్లడించారు. చంద్రబాబుతో మరోసారి మాట్లాడి వక్ఫ్ అమ్మెండ్మెంట్ బిల్ గురించి కేంద్ర ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావాలో తీసుకొస్తామని భరోసా కల్పించారు.

# తాళ్ళూరుకు జన్మదిన శుభాకాంక్షలు : టీడీపీ



తాళ్ళూరు గిరినాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న తెలుగుదేశం నాయకులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గ తెలుగుదేశం సీనియర్ నాయకుడు, నెల్లూరు కిమ్స్‌హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్ తాళ్ళూరు గిరినాయుడును సోమవారం తెలుగుదేశం నాయకులు కలిసి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గిరినాయుడు జన్మదినోత్సవం కావడంతో ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మండల తెలుగుదేశం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కరరెడ్డి, జిల్లా తెలుగుయువత మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నిండునూరేళ్ళు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని, నూరేళ్ళపాటు జన్మదినోత్సవాలను జరుపుకోవాలని, రాజకీయపురోభివృద్ధి పొందాలని వారు ఆకాంక్షించారు.

# రంజాన్ పండుగ వేడుకలు



*(మొదటి పేజీ తరువాయి)*

ప్రత్యేక షామియానాలు ఏర్పాటు చేసి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. నమాజ్ అనంతరం చల్లటి మజ్జిగ, లస్సి, తాగునీరు, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఎస్ఐ సైదులు ఆదేశాల మేరకు ఏఎస్ఐలు భాస్కర్ రెడ్డి, విక్రమరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని గుడిపాడు, చిరమన అనుమసముద్రం, రాజవోలు, హసనాపురం, గుంపర్లపాడు తదితర గ్రామాల్లోని మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# మోదీ ప్రభుత్వ లొంగుబాటు విధానాలకు వ్యతిరరేఖంగా పోరాటం




**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలో అఖిల భారత రైతు కూలిసంఘం జాతీయ మూడవ మహా సభ పిలుపు మేరకు 'భారత వ్యవసాయ మార్కెట్లను బడా కార్పొరేట్ శక్తులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ, అమెరికన్ సామ్రాజ్యవాదానికి మోడీ ప్రభుత్వ లొంగుబాటు విధానాలను నిరసిస్తూ' ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సైదాపురంలో అఖిల భారత రైతు-కూలీ సంఘం కార్యాలయం నుండి ప్రదర్శనగా బయల్దేరి అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి.. రైతాంగ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి.. మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సైదాపురం బస్టాండ్ సెంటర్లో రాస్తా రోకో చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) అధ్యక్షుడు డీపీ పోలయ్య మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధికారం చేపట్టిన డోనాల్డ్ ట్రంప్ వరుస పెట్టి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లతో అటు అంతర్జాతీయ వాణిజ్యరంగంలో, ఇటు అంతర్జాతీయ రాజకీయ రంగంలో ప్రకంపనలు సృష్టిస్తున్నాడని విమర్శించారు. గాజాను, గ్రీన్ ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని, పనామా కాలువపై తమదే ఆధిపత్యమని, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి బయటికి వచ్చేస్తామని బెదిరింపులు జారీ చేస్తున్నాడని అన్నారు. అంతే కాకుండా మెక్సికో, కెనడాలపై 25శాతం దిగిమతి సంఘం విధించడంతో పాటు, చైనా, భారత్‌లపై కూడా అధిక సుంకాలను విధించడం జరిగిందన్నారు. దాదాపు 43దేశాల పౌరుల ప్రయాణాలపై పరిమితులు విధించాడని అన్నారు. అమెరికా దక్షిణాన మెక్సికో దేశంతో ఉన్న సరిహద్దు వెంబడి జాతీయ ఎమర్జెన్సీ ప్రకటించి కొలంబియా, మెక్సికో, ఇండియా వంటి దేశాల నుండి వెళ్లి అధికార పత్రాలు లేనివారిని సి-17 లాంటి మిలటరీ రవాణా విమానాల్లో సంకెళ్లు వేసి మరి ఆయా దేశాలు పంపిస్తున్నాడని అన్నారు. సి-17 మిలిటరీ రవాణా విమానంలో మొదటి విడతగా 104 మంది భారతీయులను కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసి, వారిని చెక్కబల్లపై కాళ్లతో అటు ఇటు కదలకుండా కట్టిపడేసి గూడ్స్ మాదిరి పంపించాడని, రెండవ దఫా కూడా 228 మందిని ఇదే విధంగా పంపడం హేయమైన చర్యఅని అన్నారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను తుంగలో తొక్కి, ప్రపంచశాంతికి విఘాతం కలిగిస్తూ ట్రంప్ చేస్తున్న అమానవీయ చర్యలను కొలంబియా, మెక్సికో, కెనడా, చైనా వంటి దేశాలు నిరసించినా భారత ప్రధాని మోడీకి మాత్రం ఆగ్రహం కలగకపోవడం సిగ్గుచేటని అన్నారు. భారతీయ అక్రమ వలసదారులను ఈ విధంగా పంపడం కొత్తేమి కాదని, 2009 నుండి అమెరికా మొత్తం 15,756 మంది భారతీయులను బహిష్కరించి ఇండియాకు పంపిందని భారత విదేశాంగ మంత్రి జయశంకర్ రాజ్యసభలో ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. భారత పాలకులు అమెరికా సామ్రాజ్యవాద దోపిడీ విధానాలకు, లొంగుబాటుకు గురి కావడం చాలా దుర్మార్గమని, భారత సార్వభౌమత్వానికి ఉప్పు పాతరేశారని విమర్శించారు. అంతేకాకుండా భారత వ్యవసాయ మార్కెట్లను అమెరికా వంటి సామ్రాజ్యవాద, బడా కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానంతో రైతుల ప్రయోజనాలను బలిపెట్టి, కార్పొరేట్ లాభాలను అత్యధిక స్థాయికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫారసులను అమలు చేయాలని, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ను చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను, ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేస్తుందని విమర్శించారు. అమెరికా వంటి సామ్రాజ్యవాదులకు గూలంగిరి చేస్తూ, వారి పాదాల వద్ద మోకరిల్లుతుందని అన్నారు. దేశంలో నూటికి 70శాతం మంది ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి వ్యతిరేకంగా పీడిత ప్రజానీకం అంతా ఉద్యమించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు జిల్లా నాయకులు పందిటి వెంకటయ్య, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు బి.మమత, భారత కార్మిక సంఘాల సమైఖ్య జిల్లా నాయకులు కె.చెంగల్ రావు, నాయకులు పి.అనూష, ఎ.నాగమణి, పి.కోటయ్య, పి.శ్రీను, ఎ.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ చొరవతో విద్యుత్ వెలుగులు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఎన్నో సంవత్సరాలుగా సమస్యగా మిగిలి ఉన్న విద్యుత్ సమస్య సర్పంచ్ రొడ్డా వెంగమ్మ చొరవతో ఊటుకూరు మెయిన్ రోడ్డులో విద్యుత్ వెలుగులు విరాజిల్లుతున్నాయి. రాత్రి వేళలో బస్సు దిగిన ప్రయాణికులు చిమ్మ చీకట్లో సుమారు రెండు కిలోమీటర్లు ఊటుకూరు గ్రామానికి మరో కిలోమీటర్ తక్కెళ్ళపాడు గ్రామంకు వెళ్లాల్సిన పరిస్థితి. ప్రతినిత్యం ఆయా గ్రామాల నుండి వివిధ పనుల నిమిత్తం వింజమూరు, కావలి, నెల్లూరు, వెళ్లి తిరిగి స్వగ్రామంకు రాత్రి సమయంలో వస్తే భయం భయంతో గ్రామానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఈ నేపథ్యంలో పంచాయతీ ప్రజలు పడుతున్న కష్టాలను బాధలను గమనించిన సర్పంచ్ వెంగమ్మచొరవ తీసుకోని తన భర్తమాజీ ఎంపీటీసీ సభ్యులు రొడ్డా కొండయ్య సారధ్యంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లు బిగించడం జరిగింది. ఏ సమయంలో ప్రయాణికులు బస్సు దిగిన విద్యుత్ వెలుగులో ఉన్నందున భయం లేకుండా గ్రామానికి రావచ్చని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఒకపక్క ఆంజనేయ స్వామి దేవాలయం, మరోపక్క ఊటుకూరు ముఖద్వారం ఉన్నందువలన ఈ విద్యుత్ వెలుగులతో బహుముచ్చటగా ఉంటుందని



వారు అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనప్పటికీ ఈ విద్యుత్ వెలుగులు అందరికీ ఎంతగానో ఉపయోగపడుతుందని ఊటుకూరు పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సుందరీకరణకు నోచుకోని రోడ్డు



**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నుంచి పొట్టే పాళెంకు పోయే రోడ్డు సుందరీకరణకు నోచుకోకపోవడం విశేషం. ఈ రోడ్డు కొంతవరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఉంది. నెల్లూరు నుంచి జొన్నవాడ, నరసింహకొండకు వెళ్లే ఈ రహదారిపై ఇటు అధికారులు, ఆటు ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టకపోవడం గమనార్హం. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు పరిస్థితి దుర్భరంగా ఉంది. వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు సాయంత్రం అయిందంటే వాహనదారులకు నరకం చూపిస్తోంది. ముఖ్యంగా, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎంతో విశాలంగా ఉండే ఈ రోడ్డుకు డివైడర్ ఏర్పాటు చేసినప్పటికీ ఇక్కడ విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. మరోపక్క పచ్చదనంతో సుందరంగా ఉండవలసిన ఈ రోడ్డు అధ్వానంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి ఈ మార్గం గుండానే నరసింహకొండ, జొన్నవాడ దేవస్థానాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వెళతారు. అయితే ఈ ప్రాంతంలో కనీసం ఎక్కడ కూడా విద్యుత్ కాంతులు రాత్రిపూట పూర్తిస్థాయిలో కనిపించకపోవడం విశేషం. ఒకపక్క ఈ రోడ్డులో రాత్రిపూట పశువులు సంచరిస్తుంటాయి. దీంతో కొన్ని సందర్భాల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. నెల్లూరు రూరల్, కోవూరు నియోజకవర్గాలకు పోయేందుకు ఉన్న ఈ రోడ్డుపై అధికారులు దృష్టి పెట్టకపోవడం గమనార్హం. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతాన్ని కనీసం సుందరీకరణ చేసి విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేస్తే ఈ రోడ్డు వాహనదారులకు సౌకర్యంగానేగాక, చూపరులకు సైతం అందంగా కనిపిస్తూ ఆహ్లాదకరంగా మారుతుందనేది స్థానికుల అభిప్రాయంగా ఉంది. అయితే ఈ రోడ్డు గురించి పట్టించుకునే వారే లేకపోవడంతో ప్రస్తుతం ఒక పక్క మట్టి చేరి చాలా చోట్ల దుర్భరంగా మారింది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రోడ్డుపై ప్రత్యేక దృష్టి పెట్టి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లకు విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా కూడా కనిపించనుంది.

# నిత్యాన్నదాన ద్వైవార్షికోత్సవ సంబరాలు

### సేవతో జన్మసార్ధకమంటున్న దాత కంచి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రతినిత్యం వందలాదిమందికి అన్నదానం చేస్తుండడం, ఇతరత్రా సామాజికసేవా కార్యక్రమాలతో తన జన్మసార్ధకమైందని, అత్యంత అనూహ్య సంతృప్తి పొందానని ఆత్మకూరులో నిత్యాన్నదాత, శ్రీ సాంబశివచారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి వెల్లడించారు. ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయన అభిమానుల మద్య నిత్యాన్నదానం నిర్వహించే జిల్లా ప్రభుత్వవైద్యశాలలోని కంచిట్రస్ట్ భవన్‌లో కేక్‌కట్‌చేసి అందరికీ పంచిపెట్టి ఆనందోత్సాహాలమద్య సంబరాలు జరుపుకున్నారు. 2023మార్చి31వతేదీన ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో కంచి పరమేశ్వరరెడ్డి నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించడం, అనంతరం అనేక సామాజికసేవా కార్యక్రమాలు నిర్వహించడం తెల్సిందే. విజయవంతంగా పెద్దఎత్తున స్వంతనిధులు వెచ్చించి ఏర్పాటుచేసి కొనసాగిస్తున్న అన్నదాన కార్యక్రమం సోమవారానికి రెండేళ్ళు పూర్తియి మూడవ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా పరమేశ్వరరెడ్డి ఉత్సాహంగా కేక్‌కట్‌చేసి అందరికి పంచిపెట్టి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సేవాభావంతో ఎలాంటి లాభాపసేక్షలేకుండాఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరిస్తూ తెలంగాణాలోని నల్గొండగద్దర్ పాడిన పాటను అందరూ ఆలకించారు. కంచి చేస్తున్న సేవా కార్యక్రమాల్లో తాము నిత్యంత భాగస్వాములవుతుండడం ఎంతో సంతోషకరం, సంతృప్తిదాయకం అని స్థానిక తెలుగు భారతిసేవా సమితి సభ్యులు, ఉపాధ్యాయ, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిత్యాన్నదాత, సామాజికసేవాప్రదాత కంచి పరమేశ్వరరెడ్డి ప్రసంగిస్తూ తాను జన్మించిన 1963 మే1వ తేదీ కన్నా తాను సేవాక్యాక్రమాలు ప్రారంభించిన 2023 మార్చి 31న అత్యంత ప్రాధాన్యతగా భావిస్తున్నానని, మహాయజ్ఞంలాగా తాను చేపట్టిన సేవా కార్యక్రమాలను అందరి సహకారంతో విజయ వంతం



గా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. హాస్టిటల్‌లో అన్నదానం ప్రారంభించిన రోజునే తన పుట్టినరోజుగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈరెండు సంవత్సరాల్లో ఆత్మకూరులోని హాస్పిటల్‌లో ప్రారంభించిన అన్నదానం కార్యక్రమంలో 3,92,175 మంది భాజనాలు చేశారని, అనూహ్యమైన సంతృప్తి, అనుభూతి పొందుతున్నారన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఎవరు మరణించినా ఆ కుటుంబానికి 10వేలరూపాయలు అందజేస్తున్నానని, ఇప్పటివరకు 236మందికి 22,80,500 రూపాయలు అందజేశానని, మృతదేహాలు చెడిపోకుండేలా ఆరు శవపేటికలను సమకూర్చగా 258మంది వినియోగించుకున్నారని, మృతదేహాలను శ్మశానవాటికకు తరలించేందుకు ఒక కైలాస రథయాత్ర వాహనాన్ని సమకూర్చగా ఇప్పటి వరకు 122మంది వినియోగించుకున్నారని ఆయన వివరిస్తూ తాను భగవంతుని కృపతో సామాజికసేవా కార్యక్రమాలు చేపట్టానని, తనకు లభించిన గొప్ప అవకాశమని, సేవలు తనకెంతగానో సంతృప్తినిస్తున్నాయని పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కె.వి.శేషారెడ్డి, అచ్చోలు నారశింహారెడ్డి, మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి, తెలుగు భారతి సేవాసమితి సభ్యులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రార్ధనలకు హాజరైన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు విఆర్సి గ్రౌండ్స్‌లో 4వేల మంది ముస్లిం సోదర సోదరీమణులతో ఉదయం 7.15 గంటలకు ప్రారంభం అయిన రంజాన్ ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ప్రార్ధనల కార్యక్రమానికి సోమవారం వైయస్‌ఆర్సీపీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. వైసీపీ 42వ డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ మస్తాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పలువురు ముస్లిం సోదరులు, నాయకులను కలుసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి ప్రార్ధనలకు హాజరై ముస్లిం సోదరులకు శీతల పానీయాలు అందజేశారు.

### వేదగిరిపై మత్స్య జయంతి సందర్భంగా

## విగ్రహాల వద్ద విశేష పూజలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహ కొండపై వేంచేసియున్న వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం నందు సోమవారం మత్స్య జయంతి సందర్భంగా నరసింహకొండ రోడ్డు మార్గాన ఉన్న దశావతారం విగ్రహాల వద్ద మత్స్యావతారం విగ్రహం వద్ద విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యావతారం విశిష్టతను ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి వివరించారు. కార్యక్రమంలో అర్చకులు కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## 2 నుండి 4 వరకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం సంప్రోక్షణ

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్ :** టీటీడీ అనుబంధం ఆలయమైన అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 2 నుండి 4వ తేదీ వరకు నూతన ధ్వజస్తంభం సంప్రోక్షణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఏప్రిల్ 1న సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 2న ఉదయం 8 నుండి 11.15 గంటల వరకు వైదిక కార్యక్రమాలు, వాస్తుహెూమం, సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు కళాపకర్షణ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 3న ఉదయం 8.15 నుండి 11 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు జీవ ధ్వజస్తంభ మహా శాంతి అభిషేకం, పూర్ణాహూతి జరుగనుంది. ఏప్రిల్ 4న ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు మహా పూర్ణాహూతి, కుంభ ప్రోక్షణ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన విప్ థామస్

**కార్వేటినగరం మేజర్‌న్యూస్ :** మండలంలో ఉన్న ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వి ఎం థామస్ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు. ఈ పవిత్ర రంజాన్ మాసం మీ కుటుంబాలకు సుఖసంతోషాలను, ఆరోగ్యాన్ని మరియు శాంతిని తీసుకురావాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను. ఈ పవిత్ర ఉపవాసం, ప్రార్థనలు, దానం, పరస్పర సహాయ సహకారాలు మానవత్వాన్ని మరింతగా పెంపొందించేలా మారాలని కోరుకుంటున్నాను. సామరస్యంతో, ప్రేమతో, శాంతితో మనమంతా కలిసి సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం.

# భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే తలంటి స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి అత్యంత భక్తి శ్రద్ధలతో స్థానిక బంగ్లా సెంటర్లోని ఈద్గా వద్దకు చేరుకున్నారు. ముస్లిం సోదరులందరూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందోత్సాహాలతో ఈ పండుగను జరుపుకున్నారు. పవిత్ర గ్రంథం అయినా ఖురాన్ అనుసరించి 30 రోజులు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించి సోమవారం నెలవంక కనిపించడంతో దీక్షలను విరమించారు. ఈ రంజాన్ పండుగ సందేశాన్ని ప్రజలందరికీ పంచాలని ఆ అల్లాహ్ ప్రార్థనలు చేశారు. వస్తాదు సోదరులు ఉద్దేశించి ఖురాన్ లోని సారాంశాన్ని ప్రార్థన ద్వారా అందజేశారు. అందరూ అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ అని అంటూ అల్లాను ప్రార్థించారు. కురాన్ గ్రంథం



ప్రకారం తన సంపాదించిన సంపాదనలో కొంతమేర పేదసాధలకు దానధర్మాలు చేయాలని అందుచేత ఆ పేదలకు ధర్మాలు చేస్తూ వారి విధిని చక్కగా నిర్వర్తిస్తున్నారు చక్కగా నిర్వర్తించారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ సమానంగా కలిసిమెలిసి ప్రాంతంలో పాల్గొన్నారు. ఈద్గా ప్రాంతంలో వింజమూరు పరిసర ప్రాంతాల నుండి అనేకమంది ముస్లిం సోదరులు ప్రార్థనలో పాల్గొన్నారు. బంధువులు మిత్రులు శ్రేయోభిలాషులు అందరూ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంతో ఆనందోత్సవాలతో జరుపుకున్న ఈ పండుగ మరలా వచ్చే రంజాన్ కోసం ఎదురుచూస్తున్నారు.

# మొగుళ్ళూరులో ఘనంగా రంజాన్ వేడుకలు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని మొగుళ్ళూరు గ్రామంలో ముస్లిం సోదరులు రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్ష పాటించిన ముస్లిం సోదరులు రంజాన్‌ను ఆనందంగా జరుపుకుంటారని పేర్కొన్నారు. ఉపవాస సమయంలో ముస్లింలు జాలి, దయ, కరుణ వంటి గుణాలను అలవర్చుకుంటారని, అలాగే ఈ మంచి లక్షణాలను జీవితాంతం కొనసాగించాలన్నారు. అలాగే, పేదలకు ఎల్లప్పుడూ సహాయం చేయాలని, సన్మార్గంలో నడవాలని, ప్రవక్త మహమ్మద్ సూచించిన మార్గాన్ని అనుసరించాలని ఆయన సూచించారు. దానధర్మాలు చేస్తూ, న్యాయబద్ధంగా జీవిస్తూ ఆధ్యాత్మికతను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక నమాజ్ అనంతరం గ్రామంలోని ముస్లిం సోదరులు పరస్పరం ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సామూహిక ప్రార్థనలతో గ్రామంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ కార్యక్రమంలో కరీముల్ల, మహబూబ్ బాషా, మసుంసాహెబ్, ఖాదర్ మస్తాన్ మహమ్మద్ రఫీ, అబ్బాస్, ముజాహిద్, చంద్ బాషా, బాబు సాహెబ్, రహంతుల్లా, మొగుళ్ళూరు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్ పర్వదిన వేడుకలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలో ముస్లిం సోదరులు రంజాన్ పర్వదిన వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు బూనిన ముస్లిం సోదరులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నడుమ పండుగను ఆనందోత్సవాలతో జర పుకొన్నారు. పండుగ సందర్భంగా బందుమిత్రులను నివాసాలకు ఆహ్వానించి విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాన్నెబోయిన చెంచలబాబుయాదవ్, టీడీపీ నాయకులు ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముస్లీం సోదరులకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈద్గా మైదానం చుట్టూరా ప్రహారీ నిర్మాణంతోపాటు తాగునీటి సౌకర్యం ఏర్పాటుకు చర్యలు చేపడతానన్నారు. ఉదయగిరి పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, టీడీపీ నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, నల్లిపోగు రాజా సందానీ, రంతుజాని, శ్రీకుర్తి రవీంద్రబాబు, తుమ్మల కిరణ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన వేమిరెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని ఉస్మాన్ సాహెబ్ పేటలో వేంచేసియున్న సీతా, లక్ష్మణ, భరత, శత్రుజ్ఞ, ఆంజనేయ సమేత శ్రీ కోదండరామ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విబిఆర్ మాట్లాడుతూ.. ఆ కోదండ రాముడి ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు. అనంతరం దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన భక్తుల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

## ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే




**కావలి, మేజర్‌న్యూస్ :** రంజాన్ పర్వదిన సందర్భంగా సోమవారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కావలి పట్టణ రైల్వే రోడ్డు జామియామసీదు, వైకుంటపురం మదీనా మసీదులో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. సోదర మనులకు అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రేమా, కరుణ, ఐకమత్యం అను సందేశాలతో సేవా తత్పరత ఆధ్యాత్మికత వెల్లివిరిసే ఈద్-ఉల్-ఫితర్ పర్వదినాన అల్లా కరుణ, కటాక్షాలు పట్టణ, నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరారు. వీరితోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు మసీదు పెద్దలు ఉన్నారు.

## ముస్లిం సోదరుల నిరసన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో సోమవారం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు నూతనంగా అమలు చేసిన వక్ఫ్‌బోర్డు చట్టసరణలకు వ్యతిరేకంగా నల్లరిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం వారు నూతన వక్స్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మతపెద్దలు, ఇమామ్లు. మౌజన్లు తదితరులు పాల్గొన్నారు.

## గురప్ప స్వామికి ప్రత్యేక పూజలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు నడిమూరు నందు వేంచేసియున్న శ్రీ గురప్ప స్వామి అంకాలమ్మ నాగవరపమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉగాది రంజాన్ పర్వదినాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే స్వామివారి ఆలయానికి చేరి నైవేద్యాలు సమర్పించారు. స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి పునీతులయ్యారు.

## ముస్లింల సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్ :** ముస్లింల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఈద్గా మైదాన సమస్యను సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈద్గా మైదానంలో సోమవారం జరిగిన రంజాన్ ప్రార్థనల్లో ముస్లీం సోదరులతో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ప్రార్థనలు అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ దివ్య ఖురాన్ అవతరించిన నెల కావడంతో ముస్లీంలకు రంజాన్ నెల ప్రత్యేకమైనదన్నారు. క్రమశిక్షణ, దానగుణం, భక్తి భావన కలయిక రంజాన్ నెలని ఆయన చెప్పారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇమామ్ లు, మౌజన్ లకు నెలకు ఐదు వేలు, పదివేల రూపాయులు అందిస్తోందని ఆయన తెలిపారు. అలాగే మసీదుల నిర్వహణ కోసం ఐదు వేల రూపాయలను ఇస్తోందని ఆయన చెప్పారు.

# సంస్కృతి సంప్రదాయాలే భారతీయత

## హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి మహాస్వామి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** సంస్కృతి సాంప్రదాయాలే భారతీయుట అని హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి సింహపురి ఉగాది ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఉగాది మహోత్సవంలో ఆయన ప్రవచనం చేశారు. స్థానిక శివాజీ సెంటర్ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం టీవీఎస్ కళ్యాణ్ సదన్ సంయుక్తంగా సింహపురి ఉగాది ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు ప్రవచనం చేస్తూ శంకరాచార్యులు భజగోవింద స్తోత్రం వుటంకిస్తూ ప్రతి కార్యాలయంలోనూ గోవింద నామ స్మరణ చేయాలని సంవత్సర ప్రారంభ దినంగా ఉగాదిని పండుగగా జరుపుకోవాలని బ్యాంకు లావాదేవీలు అన్ని వ్యవహారాలు ఉగాదితోనే ప్రారంభమవుతోందని చెప్పారు. ఈ విశ్వావసు నామ సంవత్సరంలో భారతదేశం విశ్వంలో అత్యున్నత స్థాయికి వెళుతుందని తద్వారా భారతీయత ప్రపంచానికి ఆదర్శం అవుతుందన్నారు. తులతో ఉదయం గోపూజ గణపత్పూజ ఉగాది ప్రసాద వితరణ సాయంత్రం రామాయణం నృత్యరూపకం, వేదగిరి ఫణిశర్మ పంచాంగ శ్రవణ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక శివాజీ విగ్రహానికి నెల్లూరు మారాట మిత్ర మండలిచే నిర్మించిన మండపం లైట్లు భారత డీఆర్డీఓ మాజీ అధ్యక్షులు జి.సతీష్ రెడ్డి ఆర్టీసీ రీజినల్ చైర్మన్ ఎస్.సురేష్ రెడ్డి ముఖ్య సమన్వయకర్త పి.సురేందర్ రెడ్డి రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయ్ కుమార్‌రెడ్డి డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ చల్లా పెంచల్ రెడ్డి గంటా రమణయ్య ప్రభాకర్ రాజులు ప్రారంభిం చారు. స్వామి వారితో కలిసి ఉగాది మహో త్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సింహపురి ఉగాది ఉత్సవ సమితి అధ్యక్షులు బీఎస్ రంగ రాజన్ ప్రధాన కార్యదర్శులు వి.హర్షవర్ధన్ ఎన్.జగన్ మోహన్ పి.సత్య నాగేశ్వర రావు, కెవి సుబ్రహ్మణ్యం, డాక్టర్ కేవెన్నెల జయప్రద కే.భాస్కర్‌రావు ఆమంచర్ల ప్రభాకర్ వాసుదేవ రావు కామేశ్వర్ ప్రసాద్ పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ రవి ప్రకాష్‌కు ఉగాది పురస్కారం



**కావలి, మేజర్‌న్యూస్ :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు కావలి శాఖ చైర్మన్ దాకా రపు రవి ప్రకాష్‌కు ఉగాది పురస్కారాన్ని అందించినారు. ఆదివారం విజయవాడలో మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్ర భవనంలో ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, సుమతి అంతర్జాల తెలుగు మాసపత్రికల సంయుక్తగా నిర్వహించిన, ఉగాది పురస్కారాల ప్రధానోస్తవ సభలో సామాజిక సేవ విభాగంలో రవి ప్రకాష్‌కు దీపం ఉగాది పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి డాక్టర్ కె.మన్మధరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు గోకరాజు గంగరాజు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణలు ఈ అవార్డును ప్రధానం చేశారు. ప్రముఖ పరిశోధకులు కొండపల్లి సుందర్ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ ద్వారా రక్త కేంద్రం తల సేమియా ఆసుపత్రి, మరణాంతర సేవలు, యోగా శిక్షణ కేంద్రం, తదితర సేవలతోపాటు ప్రకృతి వైపరీత్యంలో జరిగిన అనర్థాలకు తుఫాన్ బాధితులకు విశేష సేవలు అందించిన, కావలి రెడ్‌క్రాస్ బృందాలకు నాయకత్వం వహించి విధి నిర్వహణలో తమ బాధ్యతను ఎంతో దృఢ విశ్వాసంతో సేవలందించిన రవి ప్రకాష్‌కు ఈ పురస్కారానికి ఎంపిక చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులకి చేదోడు వాదోడుగా.. పట్టణ అధ్యక్షులు బలసా ప్రసాద్



**కావలి, మేజర్‌న్యూస్ :** ఆర్యవైశ్య యువకుడు ఉత్సాహవంతుడు, ఎన్‌డీఏ ప్రభుత్వం నూతనంగా అధికారంలోకి వచ్చిన తర్వాత ది కిరాణా మర్చంట్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులుగా ఎన్నిక కాబడిన బలస ప్రసాద్ ప్రతి దినం ఆర్యవైశ్యులకి చేదోడు వాదోడుగా ఉంటూ వారి సమస్యలపై నిరంతరం కృషిచేస్తూ అందరికీ అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరికి తలలో నాలుగు లాగా ఉంటూ పట్టణ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ప్రతి దినం ఆర్యవైశ్యుల సమస్యలపై నిత్యం పోరాడుతూ, సేవా కార్యక్రమంలో ముందుంటున్న బాలసా ప్రసాద్‌కి కావలి పట్టణ ఆర్యవైశ్యులు, వ్యాపారస్తులు ప్రశంసలు కురిపించడం విశేషం. కావలి పట్టణంలో పండుగ సమయాల్లో శివాలయాల్లో తనకు తోచిన రీతిగా భక్తులకు సహాయ సహకారాలు అందిస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వ్యాపారస్తుల సమస్యలను వారి అవసరాల నిమిత్తం తమ వద్దకు వచ్చినప్పుడు తనకు తోచిన విధంగా సహాయ, సహకారాలు అందిస్తున్నారు. అలాగే పెద్ద సమస్యలు ఉన్నప్పుడు వాటిని ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు తటవర్తి రమేష్ ద్వారా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి వద్దకు తీసుకువెళ్లి ఆ సమస్యలను పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తున్నారు. అలాగే కావలి పట్టణంలోని ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటూ తనవంతుగా సహాయ, సహకారాలు అందిస్తానంటూ, యువకుడు ఉత్సాహవంతుడైన బలసా ప్రసాద్ ను ఎన్నిక సక్రమమని కావలి పట్టణ ప్రజలు, ఆర్య వైశ్యులు వ్యాపారస్తులు ప్రశంసలు కురిపిస్తున్నారు. అలాగే తను కూడా ఆర్థికంగా రాజకీయంగా ప్రజలకు తోచిన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. గత ప్రభుత్వంలో ఉన్న ది కిరాణా మర్చంట్ అసోసియేషన్ వారు ప్రజలకు అందుబాటులో లేకుండా ఉండడం విశేషం. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో ఉస్తావంతుడైన బలసా ప్రసాద్ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉం టూ ఆర్యవైశ్యులకు భరోసా కల్పిస్తున్నారు. ది కిరాణా మర్చంట్ అసోసియేషన్ తరపున ఏ సమస్య వచ్చినప్పటికీ ప్రజల పక్షాన నిలబడేందుకు సిద్ధంగా ఉన్నానంటూ ప్రజలకు భరోసా కల్పిస్తూ, ముందుకు సాగుతున్నారు. అలాగే పట్టణ వ్యాపారస్తులు కూడా ఇటువంటి యువకుడు సమర్థుడికి ఈ పదవి అప్ప చెప్పడం సక్రమమేనని కావలి పట్టణ ప్రజల్లో తమలో తాము అనుకోవడం విశేషం.

## మాజీ మంత్రి కాకాణికి మరోసారి నోటీసులు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పొదలకూరు మండలంలో అక్రమ మైనింగ్ కేసులో నోటీసులు ఇవ్వగా విచారణకు హాజరు కాకపోవడంతో సోమవారం హైదరాబాదులోని తన నివాసంలోని కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెళ్లి మంగళవారం ఉదయం 11 గంటల లోపల రూరల్ డీఎస్పీ కార్యాలయానికి హాజరుకావాలని పోలీస్ అధికారులు నోటీసులను అందజేశారు. మంగళవారం కూడా కాకాణి విచారణకు హాజరుకాకపోతే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు. ఇదిలా ఉండగా కాకాణి గోవర్ధన్ రెడ్డి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో మంజూరు చేయగా అందుకు సంబంధించిన బెయిల్ పై విచారణ కూడా మంగళవారం జరుగనున్నది. ఈ నేపథ్యంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసు ఇచ్చిన సమాచారం మేరకు రూరల్ డీఎస్పీ కార్యాలయంకు హాజరవుతారా లేదో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## మర్రిపాడులో ఘనంగా రంజాన్ వేడుకలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలో సోమవారం ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. మండల పరిధిలోని పడమటి నాయుడుపల్లి, చుంచులూరు, మర్రిపాడు, పల్లవోలు, నందవరం, కదిరినేనిపల్లి, సింగనపల్లి, కృష్ణాపురం, చిలకపాడు, అల్లంపాడు, నాగినేనిగుంట తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆ ఈద్గాల వద్ద ముజావర్లు ఖురాన్‌ను చదివి వినిపించారు. అనంతరం హిందువులు ముస్లింలు హాయ్ భాయ్ అంటూ ఆలింగనం చేసుకున్నారు. కూలి పని నిమిత్తం సుదూర ప్రాంతాలకు వెళ్లిన ముస్లిం సోదరులు స్వగ్రామాలకు చేరుకుని బంధుమిత్రులతో స్నేహితులతో రంజాన్ పండుగను ఆనందంగా గడిపారు.

## ఘనంగా రంజాన్ పండుగ వేడుకలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలో ముస్లిం సోదరులు రంజాన్ పండుగ వేడుకల కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జమామి మసీదు ఈద్గా మైదానం నందు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రంజాన్ పండుగను ఘనంగా చేసుకున్నారు. భక్తిశ్రద్ధలు ఆచరిస్తూ దైవ ప్రార్థన చేశారు. ఈద్గా మైదానం వద్ద పండుగ వాతావరణం నెలకొన్నది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో నమాజ్ సౌకర్యాలు కల్పించినట్లు జాతీయ మైనార్టీ నాయకులు షేక్ అబ్దుల్ షఫీ ఉల్లా తెలియజేశారు. దీంతో ముస్లిం కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపినాయి. ముస్లిం సోదరులు ఒకరికొకరు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకుని సంతోషంగా గడిపారు. అదేవిధంగా దానధర్మాలు చేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జాతీయ మైనార్టీ నాయకులు షఫీ మాట్లాడారు. ఐకమత్యంతో రంజాన్ పండుగ జరుపుకున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చమ్మ ఉత్తర క్రియల్లో మాజీ ఎమ్మెల్యే

**కావలి, మేజర్‌న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నేత వైవి సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. అయితే ఒంగోలులో వైవి సుబ్బారెడ్డి నివాసం నందు పిచ్చమ్మ ఉత్తర క్రియలు నిర్వహించారు. ఉత్తరక్రియల కార్యక్రమానికి కావలి మాజీ ఎమ్మెల్యే హాజరై మొదటిగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డితోపాటు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.